
## అడల్ట్స్ ఓన్లీ కథ A

# శోభనం మీది - తొలిరేయి మాది

**రామచంద్రం**



ఇప్పుడు కాని మాధవ్‌ని చూస్తే- అతనికి మొన్ననే పెళ్లీ, నిన్న రాత్రే శోభనం జరిగాయని ఎవరూ అనుకోరు. జీవితంలో సర్వస్వమూ కోల్పోయిన వాడిలా.. చిత్తుగా ఓడిపోయినవాడిలా దీనాతిదీనంగా ఉన్నాడతను. జుత్తుచెదిరి, ముఖం లోకుతుపోయి, కళ్లు ఎర్రబడి బికారిలా ఉన్నాడు.

గుండెల్లో మంట. హృదయంలో బాధ. మనసులో వేదన, మెదడులో పరిపరి విధాల పోతున్న ఆలోచనలు. ఆ గదిలో ..ఒంటరిగా కూర్చుని.. కిటికీ లోంచి శూన్యంలోకి చూస్తూ.. నిట్టూర్పులు విడుస్తున్నాడు.

ఎందుకిలా జరిగింది? ప్రతి జీవికీ సహజమూ, అవసరమూ, ఆనందదాయకమూ అయిన అతి సామాన్య విషయానికే నోచుకోనప్పుడు.. శారీరక, మానసిక ఆరోగ్యానికి ఆధారమూ, జీవితానికర్థమూ అయిన సాధారణ విషయంలోనే ఘోరాతిఘోరంగా వంచించబడినప్పుడు జీవితాన్ని ఎందుకు జీవించాలి? అలాటి బతుకులో ఏముంటుందని?

నవరసాలలోనే కాదు, మానవ జీవితంలోనూ అత్యంత ప్రధానమైనది శృంగారమే. అది కరువైనప్పుడు- రస, రాగ, సౌందర్య, సంతోషాలు ఉండని బతుకుబండని కడదాకా మొయ్యడం ఎందుకు?

ఎంత దురదృష్టవంతుడు తను! ఎంత దౌర్భాగ్యుడు. విధి చేసిన వెక్కిరింతని ఎవరికీ చెప్పుకోనైనా చెప్పుకోలేడు. కాలకూట విషాన్ని శివుడు కంఠంలో ఉంచుకున్నట్లు- తను బతుకు చేదుని గుండెల్లో దాచుకోవలసిందే. తన ఉద్యోగం, అధికారం, ఆస్తి, ఆరోగ్యం, అందం, తెలివితేటలు- అన్నీ వృధా. జీవితమే వ్యర్థం. ఎప్పుడు చేసిన ఏ నేరానికి యింత శిక్ష? ఏ పాపానికి, ఏ శాపానికి తన జీవితం ఇలా సర్వనాశనమయింది? రాత్రి జరిగినది తలుచుకుంటూంటే, అతనికి చచ్చిపోవాలనిపిస్తూంది.

★ ★ ★

చిన్నప్పుడే అమ్మా నాన్నలని పోగొట్టుకున్న మాధవ్ గాలికి ధూళికి కాక పద్ధతిగానే పెరిగాడు. కట్టుదిట్టాలు లేకపోయినా క్రమశిక్షణలోనే పెద్దవాడయ్యాడు. అందుకే.. ఇరవయ్యారేళ్లు వొచ్చేసరికే అతను వ్యక్తిగా వికసించాడు. జీవితం మీద స్పష్టమయిన అభిప్రాయమూ, అవగాహనా ఏర్పరచుకున్నాడు.

కంప్యూటర్స్‌లో ప్రతిభ సాధించి, చక్కని ఉద్యోగం, క్రమం తప్పని వ్యాయామం చేస్తూ ఆరోగ్య, సౌష్టవ, సౌందర్యాలు, పుస్తకాలు, సినిమాలు, సమావేశాలలో ఉపన్యాసాల ద్వారా ఆనందమయమైన జీవితం పట్ల అంచనాలు సాధించాడు. అతనికి ఎలాటి జీవితం కావాలో స్పష్టంగా తెలుసు. అలాటిది పొందాలంటే తను ఏ అర్హతలు పొంది ఉండాలో కూడా కచ్చితంగా తెలుసు. అందుకే- అతను చాలా మంది యువకుల్లా దారం తెగిన గాలిపటంలా కాక, దారి తెలిసిన జీవితపు ప్రయాణికుడిలా ప్రవర్తిస్తున్నాడు. స్వేచ్ఛని దుర్వినియోగం చెయ్యలేదు. అది తనని పక్కదారులు పట్టించకుండా జాగ్రత్తపడ్డాడు. అతను- మత్తుపానీయాలు ముట్టలేదు. సిగరెట్ అంటలేదు. పరిచయాలనీ, స్నేహాలనీ వాటి హద్దుల్లోనే ఉంచాడు.

వివాహం మీదా..కాబోయే భార్యమీదా అతనికి కచ్చితమైన అవగాహన ఉంది. రాబోయే భార్య కన్య, పవిత్రురాలు అయివుండాలని మగవాడు కోరుకునేటట్లే, లభించబోయే భర్త నీతిమంతుడూ శీలవంతుడూ అయివుండాలని ఆమెకూడా కోరుకోడం న్యాయమే కనుక, తను ఎలాటి ప్రలోభాలకీ లోనుకాకుండా, ఒళ్లిళ్లకి లొంగకుండా బ్రహ్మచారిగా ఉంటున్నాడు. అతనికి- ఏడాది నుంచి 'భార్య' గురించి ఊహలూ...కలలూ ఎక్కువయ్యాయి. పెళ్లికోసం తొందర మొదలయింది. కొన్ని సంబంధాలు చూశాడు కాని...ఫలించలేదు. తగిన అమ్మాయి కోసం ఎదురుచూపే మిగిలింది. ఇరవై రోజులు కిందట- మదాలసని చూడమని ఎవరో పెళ్లిళ్ల పేరయ్య తీసుకువచ్చాడు. 'మదాలస'- అనే పేరే చిత్రంగా అనిపించింది. చరిత్రలాగే చక్కని పేర్లూ పునరావృతమౌతాయేమో. మదవతి ప్లస్ లాలస....మదాలస. పేరుకి తగ్గట్లే ఉంటుందా? కుతూహలం. ఆమెని చూడడమేమిటి, తన మనసు ఉత్సాహంతో ఉరకలు వేసింది. ఆనందంతో నాట్యం చేసింది. తన స్వప్నసుందరి సాక్షాత్కరించినట్లూ, నిరీక్షణ నెరవేరినట్లూ అనిపించింది.

సౌందర్యమూ, సౌష్టవమూ, చైతన్యమూ పాళ్లలో మేళవించి మహాశిల్పి చెక్కిన మంచి శిల్పంలా ఉంది. ఆ పొడవైన సూది ముక్కు అనుకున్నది సాధించేవరకూ రాజీపడనంటున్నట్లే ఉంది. విశాలమైన కన్నులలో వింతకాంతి ఆమె సర్వజ్ఞత్వాన్ని సూచిస్తున్నట్లే ప్రకాశిస్తూంది. రూపుదిద్దుకున్న వ్యక్తిత్వంలో...అద్భుతమైన ఆకర్షణతో...సౌందర్యానికి ప్రతీకలా ఉంది మదాలస. అవి చాలవన్నట్లు ఆమె కంఠంలో కోయిల గానాలు. మదాలస-మూర్తీభవించిన స్త్రీత్వం.

ఆమెకి తను తగుతాడా? అతనిలో భయమూ, సందేహమూ. ఆమె తనని అనుగ్రహించాలి. కరుణించి వరమివ్వాలి. దైవానికి ప్రార్థన. ఆమె అంగీకారం కంటే మరే అదృష్టమూ అక్కర్లేదనుకుంటూ...ఆశగా, ఆరాధనగా, అభ్యర్థనగా, తన హృదయాన్నంతనీ కళ్లల్లోనే నింపి భక్తుడు దేవతనిలా చూశాడు. అదే క్షణంలో ఆమె కూడా తనవేపు చూసి..మరెవరికీ కాక తనకి మాత్రమే అందేలా ఒక చక్కని మందహాసం చిందించింది. ఆ చిరునవ్వుని అంగీకారంగా అర్థం చేసుకుని, తన మనసు మేరుపర్వతం ఎక్కిపోయింది. విశ్వవిజేతలా పొంగిపోయాడు. తన తపస్సుకు మించిన వరం దొరికిందని మురిసిపోయాడు. అరక్షణం ఆలస్యం చెయ్యకుండా- 'నచ్చింది' అనేశాడు. మెరుపులా వొచ్చిన మదాలస..వెన్నెల్లా వెళ్లిందక్కడినుంచి తనకి మరో చూపు వరమిచ్చి.

వాళ్లు చెప్పిన మాటన్నిటికీ ఊకొట్టాడు. మదాలస కంటే విలువైన వేముంటాయి?

తను ఒక్కటే కోరాడు. ''పెళ్లి వీలయినంత తొందరలో చెయ్యండి''

''ఇరవై రోజుల్లోనే ఉంది ముహూర్తం. మేమూ తొందరపడుతూనే ఉన్నాం. వివాహం ఈ పల్లెలోనే, సంప్రదాయసిద్ధంగా జరిపిస్తాం..'' అన్నారు వాళ్లు.

మదాలసనీ, ఆ యింటినీ, ఆ పల్లెనీ వొదిలి రావడం కష్టంగా బాధగా అనిపించింది. హృదయాన్ని అక్కడ వదలి శరీరమే వొచ్చింది. ఒక్కచూపులోనే..తొలిచూపులోనే..ఎంతగా ఆకట్టేసుకుందీ తనని మదాలస!

''పెళ్లి కుదిరిందటగా! అభినందనలు..మందు పార్టీ ఇవ్వు. పెళ్లికి ముందు అనుభవం ఉంటే మంచిది..'' అన్నారు స్నేహితులు. అలాటి మాటలు చెప్పేవాళ్లు స్నేహితులేమిటి? అని మనసులో చికాకు పడుతూ

''కావాలంటే కాఫీ యిస్తాను. ఈనగాచి నక్కలపాలు చేసినట్లు, పెళ్లికి ముందు శీలాన్ని పోగొట్టుకోను. నా భార్యకి నేను పవిత్రంగానే లభిస్తాను. ఎప్పటికీ ఆమెకి విశ్వాసపాత్రుడిగా..శీలవంతుడిగా, నీతిమంతుడిగానే ఉంటాను. నాకు భార్య మాత్రమే స్త్రీ'' అంటూ వాళ్లకి స్వీట్లు యిచ్చాడు మాధవ్.

''నీ సంగతి తెలిసి..ఆశ చావక కదిపాం..బుద్ధొచ్చింది. పెళ్లికి పిలుస్తావుగా'' వెళ్లారు వాళ్లు.

ఇక మొదలు- ఎంతటెంతట ఆ రోజు వొస్తుందా

## రహస్యం

మనలో ఉన్న ప్లస్‌పాయింట్స్‌ని ఎప్పుడూ దూరం చేసుకోకూడదంటోంది ఇషా కొప్పీకర్. సినీతారలు వయసు మీదపడుతున్నా ఎంతో అందంగా ఉంటారు. తమ అందాన్ని పరిరక్షించుకునేందుకు ఎంతో తాపత్రయపడుతుంటారు. 'ఇష్క్ సముందర్' 'ఖల్లాస్' చిత్రాలతో తనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్న ఇషా కొప్పీకర్ తానెంతో స్ట్రాంగ్ ఉమెన్‌ని అని చెబుతోంది. కుర్తాలు ధరించడం ఎక్కువ ఇష్టం అని చెప్పే ఇషా ఏరోబిక్స్, స్ట్రెచ్చింగ్, వెయిట్ ట్రైనింగ్, కార్డియో చేస్తానంటోంది. ఎంత బిజీగా ఉన్నా వారానికి అయిదురోజులు మాత్రమే షూటింగ్స్‌లో పాల్గొంటానంటోంది.



అని తహతహ. తపన. తొందర. కన్ను మూసినా తెరచినా మదాలసే. ఆమె అందాలే. మేలుకుని ఉంటే ఊహాలూ..నిద్రపడితే కలలూ.

★ ★ ★

రాత్రి..తనూ మదాలసా ఒకరి చెయ్యి ఒకరందుకుని..కబుర్లు చెప్పుకుంటూ నడక.

బీచ్..ఎదురుగా తమ యౌవనంలా ఉరకలు వేస్తూ సముద్రం, కెరటాలతో తమని ముట్టుకోవాలనీ, పట్టుకోవాలనీ ఆటలు..పైన చందమామ..పాదాలకింద మెత్తని చల్లని యిసుక.

సముద్రం మీంచి నీటి తుంపరలతో చల్లనిగాలి. ఆకాశం మీంచి, మంచుతో కూడిన చల్లని వెన్నెల. నేలమీద చల్లని యిసుక. చల్లగా గిలిగింతలు పెడుతూంటే..వెచ్చదనం కోసం కోరిక.

''ఎందుకూ అలా చలి పెట్టడం? నాదగ్గర పొగరాని కుంపట్లు ఉన్నాయిగా..చలి కాచుకోండి'' చిలిపి నవ్వు.

''నీ చలి కూడా తీరుతుందిలే'' అంటూ అతనామెను గాఢంగా కౌగిలిలో బిగించాడు. ఆమె అతనిలోకి గువ్వలా ఒదిగిపోతూ పావురంలా కువకువలాడింది. ఆ కౌగిలి ఎంత హాయి! ఆ పెదవులు ఎంత తియ్యన! వెన్నెలలో సముద్రం ముందు యిసుక తిన్నెల హంసతూలికా తల్పాల మీద వీళ్లిద్దరూ అపర రతీమన్మథులే అయి- సుఖ స్వర్గాల అంచులు దాటి విహారాలు.

★ ★ ★

వన విహారం..తియ్యని ప్రేమ కబుర్లు చెప్పుకుంటూ. అడవిలో పూలుకోస్తూ మాలలు కట్టి, ఆమె మెడలో దండలా..నడుముకి వడ్డాణంలా..కాళ్లకి గజ్జెల్లా..అలంకరించి పూజలని చేసి.. ''వనకన్యా!'' అని తను పిలిస్తే ''ఏం వనపురుషా'' అని ఆమె తనని ముద్దుపెట్టుకుంది. ఆ పూలరాశిని కౌగలించుకుంటుంటే..ఎంత పరవశం! ఎలాటి పరిమళం! ఆమె తనని అల్లుకుపోతూంటే పూలతీగె చుట్టుకుంటున్నట్లే. ఆమెనలాగే కొండశిఖరానికి ఎగరేసుకెళ్లాడు. అప్పటికి చందమామ ఆకాశంలోకి వొచ్చాడు.

ఆమెకు మబ్బు పొరలు చుట్టాడు. చుక్కలను తెంపి చెక్కిళ్లమీద అద్దాడు. నెలవంకని తురిమి సిగలో అమర్చాడు. శిరసు మీద కిరీటం. 'మదాలస ఎంత బాగుందో!' అని అతనంటే ఆమె ఎంత చక్కగా నవ్విందో! సెలయేటి గలగలలలాగ. ఆమె సౌందర్యదేవత. రసలోక రాజ్ఞి.

★ ★ ★

వానలో చిన్నపిల్లలే అయిపోయి ఆటలు. చల్లగా చక్కిలిగింతలు పెడుతున్న చినుకులని కవ్విస్తూ కౌగిళ్లూ, ముద్దులూ. ఒకసారి చక్కని సరస్సు కనపడింది. ఆ నీరు రమ్మని ఊరించింది. అతను ఆమె వేపు చూశాడు. చురుకైన ఆమె అతని అభిలాషను యిట్టే గ్రహించేసి, సై అంటున్నట్లు చిత్రంగా నవ్వింది. అంతే. ఇక ఇద్దరూ వొళ్లు మరిచిపోయారు. నీటిలోకి ఉరికారు. చేపలే అయ్యారు. ఆమె మత్స్యకన్య. తాను మత్స్యరాజు. ఆ నీటిలో జలక్రీడలు..కేరింతలు..తుళ్ళింతలు..ఒకరినొకరు తడుపుతూ, తడుముతూ, రెచ్చగొడుతూ శృంగార లీలలు. మదాలస అప్సరసే! ఎప్పటికో వొడ్డుకొచ్చి కౌగిళ్లు, ముద్దులతో ఒకరి వొళ్లు ఒకరు ఆరబెట్టుకున్నారు.

అందమే ఆనందం. ఆనందమే జీవిత మకరందం. ఆనందానికి అలసటా, విసుగూ ఉండవు.

★ ★ ★

చదివిన సాహిత్యం, చూసిన సినిమాలూ, టీవీ, భావకుణ్ని చేసి వదిలాయి. వివాహం జరిగిపోయాక విరహం సుఖం కావొచ్చునేమో కానీ...వివాహానికి ముందు విరహం మాత్రం తియ్యని వేదనే- అనుకున్నాడు మాధవ్. శోభనం గురించి అతని ఊహాచిత్రాలు అన్నీ ఇన్నీ కావు. అవన్నీ అత్యంత సుందరమైనవి.



ఎంతటెంతట మదాలస తనదౌతుందా అని ఒకటే తపనా, ఆరాటమూ. ఆరాటపడుతున్నకొద్దీ మెల్లగా నడుస్తుందేమో కాలం- అనుకునేవాడు. మధురమయిన ఊహాలూ, సుందర స్వప్నాలతో రోజులు వెళ్లించసాగాడెలాగో.

ఎంతో ఊరించి ఊరించి..ఎలాగైతేనేం వచ్చింది ముహూర్తం. మదాలస ఉత్తరం రాస్తుందేమో అనుకున్నాడు కానీ రాయలేదు. ఎలా రాస్తుంది? ఎంతయినా ఆడపిల్ల. చదువుకున్నదైనా సిగ్గెక్కడికిపోతుంది? పైగా పల్లెటూరు. టెలిఫోన్ సౌకర్యం కూడా లేదు.

పల్లెటూరి పెళ్లి. అలాగే జరిగింది. ఛాదస్తాలు.

## మంచి మిత్రులు

**పరిస్థితులు ఎవర్ని మిత్రులుగా మారుస్తాయో, ఎవర్ని శత్రువులుగా మారుస్తాయో ఎవ్వరికీ తెలియదు. ఇప్పుడు సొట్టబుగ్గల సుందరి ప్రీతీజింటా, రంగీలా రాణి ఊర్మిళా మతోండ్కర్‌లు ఇప్పుడు మంచి మిత్రులుగా మారిపోయారు. వీరిద్దరూ ఎప్పుడూ ఎంతో క్లోజ్‌గా తిరిగారుట. సినిమాలకి సంబంధించిన విషయాలతో పాటూ, వ్యక్తిగతమైన విషయాల్లో కూడా వీరిద్దరూ మంచి మిత్రులుగా ఉంటారన్న మాటని ఇండస్ట్రీ జనం నిర్ధారిస్తున్నారు.**

సొగతీతలు. మోటు సరసాలు..సరదాలు... పురోహితుడు తక్కువ డ్రిల్లు చేయించలేదు పెళ్లితంతుల పేరిట. పాలకోసం రాళ్లు మొయ్యడం అనే సామెతని గుర్తుతెచ్చుకునీ..ఎలాగో యీ యిబ్బంది గట్టెక్కిస్తే, రేపు శోభనం..మదాలస పూర్తిగా అచ్చంగా..అందంగా. తనదయ్యేరోజు..అనుకుని సరిపెట్టుకుంటూ భరించసాగాడు. మదాలస తల ఎత్తలేదు. తనవేపు చూడనయినా లేదు. పీటల మీద పక్కనే కూర్చుని తనతోపాటు చాలా పనులలో పాల్గొన్నా. ఎలా ఐతేనేం పెళ్లయింది. అమ్మయ్య. ఇక మదాలస తనదే అనుకున్నాడు.

★ ★ ★

శోభనం గదిని చూస్తూనే అతనికి బాధ కలిగింది. నిరుత్సాహం ఆవరించింది. వెగటుగా అనిపించింది. పాతకాలపు పందిరిమంచం. ఒకే గోడకు ఎత్తుగా ఎక్కడో ఒకే ఒక్క చిన్న కిటికీ. అలాటి పూర్వకాలపు పాతగదికి అటాచ్డ్ బాత్‌రూమ్ ఎందుకుంటుంది? గోడలకి మాసిపోయిన ఫోటోలలో కనిపించీ కనిపించని శృంగార చిత్రాలు. గదిలో ఒక మూల బల్ల మీద బకాసురుడి భోజనంలా తినుబండారాలు. పొగపెట్టినట్లు గుప్పుమంటున్న అగరు

బత్తీలు. మదాలస తనింటికి వొచ్చేసరికి, తయారు చేసి ఉంచబడిన తమ పడకగదిని చూసి ఆశ్చర్యపోయేలా తీర్చిదిద్దాడు తను తమ బెడ్‌రూమ్‌ని. అడ్వాన్సుగా ఈ శోభనం గది. సరే.. గొంగట్లో తింటూ వెంట్రుకలని అసహ్యించుకోవడమెందుకు? ఏమైనా అంటే సంప్రదాయమంటారు. పల్లెటూరు. భరించవలసిందే. వీళ్లది స్థానబలమూ, అనాగరికతా కూడా. ఇదేమీ శాశ్వతం కాదు కదా.

'ఎంత సిగ్గూ, పల్లెటూరి పద్ధతులూ అయినా పీటల మీద పక్కనే కూర్చున్నా తనవేపు ఒక్కసారి చూడలేదేం? నేను చిలిపి పని చేయబోతే దూరంగా జరిగావేం? అందుకు శిక్షేమిటో తెలుసా?' అంటూ ఆమె రెండు బుగ్గలూ గట్టిగా ముద్దుపెట్టేసుకోవాలి.

మాధవ్ ఊహలలో విహరించసాగాడు. ఏవో శబ్దాలకి ఈ లోకంలోకి వచ్చి- గడియారం చూశాడు. పదిగంటలు! ఇంత ఆలస్యమా? ఏం మనుషులో. ఆలోచనా లేదు, అభిరుచీ లేదు. ఆచారం, అలవాటు అనేస్తారు. ద్వారం దగ్గర తలుపు తెరిచిన చప్పుడు.. కీచుమంటూ, కర్ణ-శంగా. అటు చూశాడు తుళ్లిపడి. అమ్మలక్క-లు కాబోలు, మదాలసని గదిలోకి తోసి తలుపు వేసేశారు, జైలులో పెట్టినట్లు. వీళ్లు వెళ్లేవరకూ ఆగి.. ఆమెని మంచం వద్దకు నడిపించుకొద్దామనుకునేంతలో ఆమె వొచ్చెయ్యసాగింది. పలచని తెల్లచీర..సర్వాంగ సుందరంగా అలంకరణ. నల్లని జడ కనిపించకుండా మొగిలిరేకుల జడ. పాదాలకీ అరచేతులకీ పారాణి. మతిపోగొట్టేంత అందంగా ఉంది మదాలస. అతను విభ్రమం నుంచీ, ఉద్వేగం నుంచీ తేరుకుందుకు తీసుకున్న కొద్దిక్షణాలలోనే- ఆమె విసవిస నడిచింది. మంచం వేపూ కాదు, తనవేపూ కాదు, ఇటు కన్నెత్తి చూడనైనా లేదు. ఆ మూల లాంఛనంగా ఉంచిన చాప పరుచుకుని పడుకుంది. ఆమె ప్రవర్తనకు తను నిర్ఘాంతపోయాడు. ఇది అనూహ్యం. అనుకోని పిడుగుపాటుకు ఒక నిముషం మతిపోయినా..అంతలోనే తేరుకున్నాడు. మదాలస తనని ఆటపట్టిస్తుందేమో అనుకున్నాడు.

మెల్లగా ఆమె వద్దకు నడిచి..పక్కనే కూర్చుని లాలనగా.. ''నామీద కోపమా? ఎందుకూ? ఎందుకైతే ఏంలే. నేను నీకు తెలియకుండా తప్పు చేసి ఉంటే క్షమించు. నన్ను శిక్షించడానికి ఇది కాదు మార్గం'' అంటూ ఆమె మీద చెయ్యి వేయబోయాడు. దూరంగా పొమ్మన్నట్లు నోటితో కాక కదలిక ద్వారా చెప్పి ముసుగు కప్పుకుని మూడంకె వేసేసింది. అతనికేమీ అర్థం కాలేదు. బతిమాలాడు. ప్రార్థించాడు. ఆమెలో ఏమీ చలనం కలగలేదు. వెర్రి మొహం వేసి వెనక్కి వచ్చేసి మంచం మీద కూర్చున్నాడు.

శోభనం గదిలో యిలా ప్రవర్తించే మదాలస లాటి స్త్రీ ఎక్కడేనా ఉంటుందా? చరిత్రలో ఎప్పుడేనా ఉందా? ఆమె ఎందుకిలా చేస్తోంది? తనంటే ప్రేమ లేదా? ఎవరినేనా ప్రేమించిందా? మరైతే పెళ్లిచూపుల్లో అంత ఉత్సాహంగా ఎందుకుంది? ఇప్పుడెందుకిలా చేస్తోంది? ఈమాత్రం దానికి తనని పెళ్లి చేసుకోవడం ఎందుకు? ఆమె దృష్టిలో పెళ్ళంటే పెళ్లే తప్ప శోభనం కాదా? ఛీ..అంతో యింతో చదువుకుంది. ఆపాటి వయసూ ఉంది. పైగా పల్లెటూర్లో ఉంటోంది. పెళ్లీ, స్త్రీ పురుష సంబంధమూ తెలియకుండా ఉంటాయా? అందులోనూ ఆడపిల్ల. ఇలాంటివి యిట్టే గ్రహిస్తుంది. మరి-ఇదేపాటి? ఎంత జడురాలైనా శోభనం గదిలో..ఇంత దారుణంగా ప్రవర్తిస్తుందా?

ఆమె చాపమీద నిర్వికారంగా..ఏమీ జరగనట్లే.. మునపటి రాత్రులలాగే..మామూలుగా నిద్రపోతూంటే చూస్తున్న అతనికి ఆశ్చర్యమేకాక పట్టలేనంత కోపం కూడా వచ్చింది. కానీ ఎలాగో నిగ్రహించుకున్నాడు.

అసలామె మనిషి కాదా? మనసు లేకపోతే మెదడు కూడా లేదా? పిచ్చిదా? పెళ్లి.. భర్త..బంధం..బాధ్యత లాటివామెకి తెలియదా? అర్థంకావా? డిగ్రీ పాసయ్యానందే! ఆమెకోసం కాకపోతే తనకోసమైనా కొంచెం మృదువుగా మానవత్వంతో ఉండొచ్చుగా. శత్రువునో, గొంగళిపురుగునోలా..అలా విదిలించి కొట్టెయ్యడమేమిటి? తను ఆమె మెడలో తాళి కట్టాడని మరిచిపోయిందా? సభ్యత..సంస్కారం..మర్యాద కనీస స్థాయిలో కూడా లేవా ఆమెలో? స్త్రీ అయి వుండీ ఏమిటీ మూర్ఖత్వం. పెళ్లి చూపులనాటి మదాలసకీ..పెళ్లిపీటల మీద ఆమెకీ..శోభనం గదిలో యీమెకీ ఎంత వ్యత్యాసం..ఎంత వైరుధ్యం! ఏమిటీ అయోమయం?

మదాలస స్త్రీ కాదు..మనిషే కాదు. వొట్టి..అందమైన స్పందనలేని శిల్పం. ఆమెలో స్త్రీత్వం మాట అటుంచి, మానవ నైజమే లేదు.



## ప్రేమే జీవితం

**వయసులో ఉన్నవారైనా, వయసుడిగినవారైనా ప్రేమ పేరు చెబితే ఊహల్లోకి వెళ్లిపోతారు. సంచలన తార లీసారే ఇప్పుడు ఈ సంగతి చెబుతుంటే మాటలాడలేకపోతోంది. 'ప్రేమ అంటే ఏంటో గానీ ఆ పేరు చెబితే కళ్ళు కైపెక్కుతాయి. నేనెప్పుడూ రొమాంటిక్‌గా ఉంటాను. ప్రేమకి ఎంతటి శక్తి ఉందంటే ఆ ప్రేమ లేకుండా నేను ఒక్క క్షణం కూడా ఉండలేను. మనిషి జీవించడానికి ఆక్సిజన్ ఎంత అవసరమో, ప్రేమ కూడా అంతే అవసరం అని నా భావన' అంటూ చక్కటి నిర్వచనం చెబుతోంది భామ.**

ఏదో కుట్ర జరిగింది. ఎంచి తను ఎంగిలాకులో కాలు వేశాడు. వేసిన అడుగు వెనక్కి రాదు. వేసిన మూడుముళ్ళూ విడవు. ఏం చెయ్యాలి తను?

రూపం మోసపూరితం అన్నది ఆమె పట్ల అక్షరాలా అన్వయించే సత్యం. తను బలి అయ్యాడు, ఎవరి మోసానికో. ఇదంతా తన కర్మ. ఎవరిననుకుని ఏం ప్రయోజనం?

ఆలోచనలలో కాలాన్నే మరిచిన అతనికి- తెల్లవారడం, మదాలస ఆ గదిలోంచి వెళ్లిపోవడమూ కూడా తెలియదు. అతను గది దాటి బయటికి అడుగుపెట్టలేదు. మదాలస ఆ గదిలోకి రానూ లేదు.

గడియారం కూడా చూడడం లేదతను. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఇక్కడ

నుంచి వెళ్లిపోవాలి వేగంగా. ఎక్కడికో...ఎవరికీ తెలియకుండా..ఎవరికీ తెలియని చోటుకి...ఎవరి కంటా పడకుండా తప్పించుకోడం ఎలా? అతను నిశ్చయానికి వచ్చేశాడు. సరిగ్గా అదే క్షణంలో...తలుపు తట్టిన చప్పుడు...తీశాడు. చతుర!

''బావగారూ! నేను మీ భార్య మదాలస కజిన్ సిస్టర్‌ని..''

అసలు మనిషితోనే బంధం తెగిపోతూంటే ఈ అనవసర బంధుత్వాలెందుకని. విరాగిలా చిరునవ్వు నవ్వాడు బలవంతంగా తెచ్చుకుని. ''తెలుసు'' అన్నాడు పొడిగా.

''అలా నీరసంగా ఉన్నారేం? ఓ మరిచిపోయాను. రాత్రే కదూ మీ శోభనం. నిద్ర ఉండి ఉండదు.''

పుండు మీద కారం జల్లినట్లే అనిపించిందా మాట. రాత్రి తనకి నిద్రలేని మాట నిజమే. కానీ..శోభనం జరగడం వల్ల కాదు, జరక్కపోవడం వల్ల.

''బావగారూ! నేను మిమ్మల్నొకటి కోరాలని వచ్చాను. ఈ రాత్రి మీరూ మదాలసా మాకు అతిథులుగా రావాలి. ప్లీజ్''

''సారీ! అలాంటివేమీ వొద్దు'' అసంకల్పితంగానే అతని కంఠంలో కొంచెం కఠినత్వం.

''దయచేసి అలా అనకండి. నేనూ మదాలసా వొట్టి అక్కాచెల్లెళ్లం మాత్రమే కాదు. ఒకరికొకరం ప్రాణమూ మనస్సూ కూడా. ఈ ప్రయాణానికి అందర్నీ ఒప్పించాను. మీరు వొచ్చి తీరడానికి రెండు బలమైన కారణాలున్నాయి. మొదటిది మా వూరు వెళ్లేదారి మీలాంటి పట్నవాసులకి అద్భుతంగా అనిపిస్తుంది. తోవలో ఒక గుడి ఉంది. రెండోది పెళ్లి చూపులనాడు మీరు నాకు వాగ్దానం చేశారు. వరమే ఇచ్చారు'' గుర్తు చేస్తున్నట్లుంది. కావొచ్చు. మదాలసని చూసిన పరవశంలో ఆవేళ తానేమైనా చేసి ఉండొచ్చు.

''కారులో వెళ్తాం. మీకేమీ అసౌకర్యం కలగదు. దయచేసి కాదనకండి, మా మంచి బావగారూ..''

కార్యసాధకురాలు చతుర. అంగీకరించక తప్పలేదు. ఆ వూరి నుంచి పారిపోవటం మరింత సులభం కావచ్చు అనుకుంటూ- అరగంట తిరక్కుండానే కారులోనే కూర్చున్నాడు. డ్రయివరు పక్కన చతుర. ఆ సీట్ల వెనక తెర. వెనక సీట్లో తనూ, మదాలసా. కొత్త దంపతులకి కొంచెం ఏకాంతం కలిగించాలని కాబోలు ఆ తెర.

పాపం, చతురకేం తెలుసు నిన్న రాత్రి శోభనం రాత్రి..ఏం జరిగిందో? ఏం జరగలేదో. తమని కొత్త దంపతులనుకుంటుంది. తాను మదాలసకి దూరంగా..శాశ్వతంగా పారిపోవలసిన పరిస్థితి అని చతురకి తెలిస్తే...

మట్టిరోడ్డు సన్నంగా..కారు మాత్రమే పట్టేంత...మెత్తని బాటమీద మెల్లగా వెళ్తొంది కారు..మట్టి మీద మెత్తగా..అతనామెను పలకరించలేదు. అద్దాలు ఎత్తి అటూ యిటూ చూడసాగాడు.

వెచ్చగా ఎండ...ఆకుపచ్చని పొలాలు గాలికి తలూపుతున్నాయి. ఆకుపచ్చని తివాసీ కదులుతున్నట్లుంది ఆ పంటచేల విన్యాసం. పొలాల వెనక తోటలు. వాటి వెనుక కొండలు. నల్లటి కొండల మీద చిత్రంగా మెరుస్తున్న సూర్యకాంతి. పొలాలలో పని చేసుకుంటున్న కూలీలు. వాళ్లు పాడుతున్న పాటలు గాలి మీద తేలి వొస్తున్నాయి. కారులోకి వీస్తున్న చల్లని గాలులు. వీటి నిండా స్వచ్ఛతా, తాజాతనమూ, కాలుష్యమనేదే లేని మలయ పవనాలు. అక్కడక్కడ పంటకాలువలు. పొలాల్లో బోరు బావులు. ఆ గొట్టాల లోంచి ఏనుగు తొండమంత ధారతో ఉబుకుతున్న నీరు. ఉండుండి కారుకడ్డం పడుతున్న పశువుల గుంపులూ, మేకలూ, గొర్రెల మందలూ. అవి రేపుతున్న ధూళి. అదోరకపు చక్కని వాసనతో ఎక్కడినుంచో వొచ్చీరాని వేణునాదం. ఎన్నడూ అనుభవం లేని ఆ ప్రకృతి సౌందర్య సాక్షాత్కారానికతను అంతా మరచిపోయాడు. ఆ సౌందర్యం చూడడంలో మునిగిపోయాడు. కారు ఎంత మెల్లగా వెళ్తోందో అతనికి తెలియదు. ఆకాశం...దిగువ హరిత సౌందర్యం..కాలవలు..కొండలు..పశువులు..పాటలు... హఠాత్తుగా..చిన్న కుదుపు. కారు ఆగిపోయింది. ఒక నిముషం అయ్యాక కారుకి చిన్న ట్రబులు. అదృష్టమేమిటంటే, ప్రమాదం ఆసుపత్రి

## సంచలనం

**ఐటెం నెంబర్ సాంగ్స్‌తో ఇప్పుడు వార్తల్లో తారలవుతుంటే కొంతమంది ఇలాంటివాటికి దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడం చర్చనీయాంశమైంది. ఇప్పుడు మల్లికా షెరావత్ వంతు వచ్చినట్టుంది. అమీర్‌ఖాన్ తాజా చిత్రం ది రైజింగ్‌లో ఓ ఐటెం నెంబర్ సాంగ్‌లో నటించేందుకు నిరాకరించి సంచలనం రేపిందీ భామ. మర్డర్ చిత్రంలో ప్రధాన భూమిక నిర్వహించిన మల్లికా ఇప్పుడు ఇలాంటి చిన్నాచితకా పాత్రలతో సంతృప్తి పడడానికి అంగీకారం తెలపడం లేదు.**



ముందయినట్లు..మంచి అనుకూలమైన చోటనే కారాగిపోవడం.. ''రండి బావగారూ'' అంది చతుర దిగమన్నట్లు కారు తలుపు తీసి. మాధవ్ దిగాడు. కొంచెం దూరం నడిచేసరికి-

అక్కడొక ఫారమ్ హౌస్. చుట్టూ పూలమొక్కల మధ్య ఆ కుటీరం నిరాడంబరంగా ప్రశాంతంగా అందంగా ఉంది. వెదురు గేటు టక టక లాడిస్తూ ''నూకమ్మా!'' అని పిలిచింది చతుర. రెండు నిముషాలలో ఒక నడివయస్కురాలొచ్చింది ''అమ్మా!'' అంటూ. ''వీరు మన మదాలస భర్త. మేము కారు బాగుచేయించుకు వస్తాం. జాగ్రత్తగా చూడు'' అని అతన్నామెకు అప్పగించి ''మీరు విశ్రాంతి తీసుకోండి బావగారూ!'' అని వెళ్లిపోయింది చతుర. అతను ఆ కాటేజీని పరిశీలించాడు. చుట్టూ కనుచూపు మేర వరకూ

పొలాలు. మధ్య ఇదొక్కటే నివాసం. రెల్లుగడ్డితో నేయబడినా..లోపల ఫాల్స్ సీలింగుంది.

ప్రవేశంలో వరండా. దానిని దాటగానే హాలు. దాని వెనక గది. వంటకి, భోజనాలకి విడి విడి గదులు. అవి తరవాత చూడొచ్చు అనుకుంటూ అతను అలా తిరిగి రావాలని బయలుదేరబోయాడు.

''బాబుగారూ! చీకటి పడ్డానికి ఎక్కువ వ్యవధి లేదు. పురుగూ పుట్రా ఉంటాయి. కుర్చీ బయటే స్తాను. కూర్చోండి'' అంటూ నూకమ్మ కుర్చీ తెచ్చి ఆరుబయట వేసింది. ''మీరెప్పుడంటే అప్పుడు స్నానానికి వేణ్నీళ్లుంటాయి బాబుగారూ''

మలిసంధ్య వేళ ఆకాశం రంగురంగుల మేఘాలతో గమ్మత్తుగా ఉంది. ఏవో పక్షులు ఆకాశానికడ్డంగా ఎగురుతున్నాయి. అలా చూస్తూండగానే చీకటి పడిపోయింది. అతను లోపలికి పోదామని లేచాడు. ఒక్కసారి మదాలస గుర్తొచ్చింది. మదాలస కూడా వెళ్లిపోయిందా చతురతో? ఉండి ఉంటే ఆమెనే అడిగి అమీ తుమీ తేల్చేసుకునేవాడు. ''రమణిలా కనిపించే రాతిబొమ్మా! నన్నెందుకిలా ధ్వంసం చేశావు?'' అని ముఖం మీద అడిగేవాడు. సరే.. ఆమె లేకపోయినా మంచిదే. స్నానం చేసి..భోజనం చేసో చెయ్యకో వెళ్లిపోవచ్చు అనుకుంటూ నూకమ్మని పిలిచాడు.. ''స్నానానికి నీళ్లు పెట్టు.''

విశాలంగానూ శుభ్రంగానూ ఉందా బాత్‌రూమ్. వేడి వేడి నీళ్లు పోసుకునే సరికి..శరీరం హాయిగా అనిపించింది. అక్కడే ఉంచబడిన లుంగీ కట్టుకుని బయటకు వచ్చేసరికి ''భోజనం వడ్డించాను బాబూ'' అని పిలిచింది నూకమ్మ. అది విందు భోజనంలాగే ఉంది. అప్పుడామె ''కొంచెంసేపు విశ్రాంతి తీసుకోండి బాబూ'' అంటూ ఆ గది తలుపు తెరిచి వెళ్లింది. మాధవ్ ఆ గదిలోకి నడిచాడు. అక్కడ..ఆశ్చర్యమో..అద్భుతమో ఎదురైనట్లు ద్వారం దగ్గరే నిలబడిపోయి చూశాడు.

ఆ గది-విశాలంగా ఉంది. ఎక్కడినుంచి వొస్తూందో తెలియకుండా వెన్నెలలాటి మృదువైన కాంతి నిండి వుంది. ఒకవేపు గోడకి పెద్ద కిటికీ వెదుళ్లతో..ఆ కిటికీలోంచి వెన్నెల..మంచం మీద పడుతూంది. అది డబుల్ కాట్. రెండు దిండ్ల మీదా..'ఐ లవ్ యూ' అని 'తొలిరేయి' అనీ ఎంబ్రాయిడరీ.

గదంతా పరిమళం. కిటికీలోంచి అలలు అలలుగా చల్లగాలి. అవతల పూల మొక్కలు..అందంగా ఊగుతూ గదిగోడకి మంచానికెదురుగా..శృంగార చిత్రం నిలువెత్తున. ఇలాటి చోట జరగాలి శోభనమంటే..ఎంత బాగుంది. ఇది మామూలు పడకగదిలా లేదు. ఎవరిదో కాని అతి చక్కని..కళాత్మకమైన అభిరుచి అనుకుంటూ అతను మంచంవేపు చూశాడు.

దుప్పటిమీద శయ్యలా పరిచిన రకరకాల రంగురంగుల పూల మధ్య..పొసగకుండా ఆడ్‌గా కనిపిస్తూ గులాబీరంగు కవరు. ఇక్కడ యిదేమిటి అనుకుంటూ దానినందుకుని చూశాడు. దాని మీద..అందమైన నీలం అక్షరాలతో తన పేరు! అతను ఆశ్చర్యపోతూ చదవసాగాడు.

''శ్రీవారూ! ఇప్పుడు మీకు నామీద చాలా కోపంగా..ద్వేషంగా కసిగా ఉండి ఉంటుంది. అది సహజమూ, సమంజసమూ కూడా. ఎందుకంటే, నిన్నరాత్రి శోభనం గదిలో విముఖంగా, విరసంగా, మూర్ఖంగా, మొండిగా, అసహనంగానూ, అసమంజసంగానూ సాగిన నా ప్రవర్తనే దానికి కారణమూ, వివరణా విన్నవిస్తున్నాను.

మనిషి జీవితంలో 'తొలి'కి ఉండే ప్రాధాన్యతా, ప్రత్యేకతా చాలా ఎక్కువ అని మీరూ అంగీకరిస్తారని ఆశిస్తున్నాను. 'మొట్టమొదటిసారి' జరిగింది జీవితాంతమూ గుర్తుండిపోతుంది. పెళ్లికాని ఆడపిల్లననే రంగుల కలలో రాజకుమారి లాటి వరుడితోపాటు, అతనితో పొందే రసరమ్యమైన తొలిరేయి అనుభవం కూడా విధిగా ఉంటుంది. అదృష్టవశాత్తూ నాకు నా కలల రాజకుమారుడే వరుడిలా లభించాడు- మీలో.

పుట్టింది పల్లెలో అయినా, చదువు, పట్నంలో ఉండడం, సాహిత్య పఠనల వల్ల నాలో కొన్ని అభిప్రాయాలు ఏర్పడ్డాయి. అభిరుచులు వికసించాయి. అవి చాలా దృఢంగా వేళ్లూనాయి నాలో. వీటి విషయంలో రాజీపడేది లేదు.

వివాహం పబ్లిక్ అఫైర్ కావొచ్చు కానీ 'శోభనం' మాత్రం వధూవరులిద్దరి వ్యక్తిగత విషయం. పూర్తిగా 'తొలిరేయి' వధూవరులిద్దరికీ జీవితాంతమూ జ్ఞాపకముండిపోయే మధురస్మృతి. అందుచేత ఆ ఏర్పాట్లలో పెద్దల ప్రమేయం ఉండకూడదు. కానీ..ఆడపిల్లనయిన నేను..నా 'తొలిరేయి'ని నేనే ఏర్పాటు చేసుకుంటాను, నా అభిరుచుల మేరకి అని చెప్పలేనుగా? పెళ్లికి లక్షలు తగలేస్తారు కానీ శోభనానికి వేలు కూడా ఖర్చుపెట్టరు, పెద్దలు. అందుచేత నేను ఊహించుకున్న, కలలుకన్న తొలిరేయికి...నిన్నరాత్రి పెద్దలు ఏర్పాటుచేసిన 'శోభనం'కి హస్తిమసకాంతరం. సంప్రదాయం, సెంటిమెంటు, ఆచారం, ప్రాతిపదికలుగా ఏర్పాటయిన 'శోభనం'లో నా ఊహల, స్వప్నాల తొలిరేయి రాజీపడలేకపోయింది. భరించలేకపోయింది. అలా జరగడం కంటే, వాయిదా వేసుకోవడమే మంచిదనిపించింది. అందుకే అలా బండలా మొండిగా నటించాను. ఔను.. మనసులో ఎంతో యిష్టమున్నా మీ ముందు అందుకు విరుద్ధంగా నటించడం తక్కువ బాధ కాదు. ఈ విషయం అప్పుడే చెప్పొచ్చుగా అనుకుంటున్నారా? నేను ఒక్కమాట మాట్లాడినా...మీ పురుష ఆవేశ ప్రకృతీ, స్వభావమూ, ఆరాటమూ..నన్నేదోలా మభ్యపరచి, మోహపెట్టి మీ వేపునకు తిప్పేసుకోవూ? మీ ముందు నిగ్రహించుకోలేనని భయం వల్లే యివాళ పగలు మీ ముందుకి, ఆ గదిలోనికి రానిది. మీరు అర్థం చేసుకోగలరీపాటికి.

మాధవ్! మన 'తొలిరేయి'- యిక్కడే.. ఈరాత్రే... కక్కుర్తి శోభనం కాదు. స్వేచ్ఛగా..నిస్సంకోచంగా..మనం మాత్రమేగా...నా మనసుతోపాటు. రాత్రి జరిగింది కూడా నేను చెప్పగా విన్న చతురే ఈ ప్రయాణ నాటకమూ, ఏర్పాట్లూ చేసింది. నూకమ్మని కూడా పంపేశాను. ఇరవై నాలుగు గంటలు తొలిరేయిని వాయిదావేసి, మిమ్మల్నెంతో బాధపెట్టినందుకూ, ఆడపిల్లనయినా నిస్సిగ్గుగా యిలా రాసినందుకూ నన్ను క్షమించేసి..నోరారా, తియ్యగా, మనసారా, ప్రేమగా-'మదాలసా!' అని పిలిచి తరువాత చూడండి.''

ఉత్తరం పూర్తిచెయ్యకుండానే పట్టలేని ఆనందం, ఉత్సాహం, ఉద్వేగంతో- ''మదాలసా'' అని పిలిచాడు.

జవాబుగా అన్నట్లు ద్వారం దగ్గర నుంచి మధుర, మంజుల, మనోహరంగా, సంగీతంలా..గాజుల చప్పుడు..అక్కడ మబ్బుపొరలాటి తెల్లని చీరలో..సర్వాంగ సుందరంగా అలంకరించుకుని, అపర అప్సరలా..మందహాసంతో మదాలస!

ఒక్క అంగలో ఆమెను చేరి..ఆత్రంగా పొదివి పట్టుకుని..ఆర్తిగా కౌగలించుకుని..ప్రేమగా ముద్దుపెట్టుకున్నాడు.

ఆమె అతనికంటే ఆరాటంగా అతన్ని అల్లుకుపోయింది.

ఇప్పుడు వీరు ఇద్దరు కారు.. ఒకే ఒక మిథున శిల్పం. దివిని భువికి దింపే శృంగార రసాస్వాదకులు. మదన క్రీడా తపస్వులు. రతీమన్మథులు..ఆలుమగలు.

ఇది వాళ్ల తొలిరేయి. వీళ్లదే అయిన మొదటిరాత్రి వీరి దాంపత్య జీవనానికి-నవ రసభరితమూ, మధురస్మృతీ అయిన నాంది.

☆

